ఉధృతంగా ప్రవహించిన చెల్లేరు వాగు

రెండు కిలో మీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఉధృతంగా ప్రవహిస్తున్న చెల్లేరు వాగు

కొండల్లో గురువారం కురిసిన వర్షాలకు రెడ్డిగణపవరం సమీపంలోని చెల్లేరు వాగు రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో కాలువకు రెండు వైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది అధికారులు వచ్చినా ఏజెన్సీ ప్రాంతంలో ఈ కొండవాగుల సమస్యలకు పరిష్కారం లభించడంలేదు. ఈ కాజ్‌వేలు అన్ని నూతనంగా నిర్మించే నేషనల్ హైవే గుండానే ఉన్నాయి. నేషనల్ హైవే నిర్మాణమైతేనే ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు ప్రయాణికులకు, విద్యార్థులు ఈ కష్టాలు తప్పేలా లేవు.

పంచాయతీల ఆదాయానికి గండి..!

గ్రామ పరిధిలోని రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం నిలుపుదల

గతంలో ఏడాదికి నాలుగు దఫాలుగా పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ చెల్లింపు

ఏడాదిన్నరగా చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి

ప్రభుత్వమే నిలిపివేసిందని చెబుతున్న రిజిస్ట్రేషన్ శాఖ

రూ.లక్షల్లో ఆదాయం కోల్పోయిన పంచాయతీలు

ఉద్యోగులకు జీతాలు సైతం ఇవ్వలేని స్థితికి మైనర్ పంచాయతీలు

మరోపక్క ఆర్థిక సంఘం నిధులను సైతం జమ చేయని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత వైసిపి ప్రభుత్వ తరహాలోనే కూటమి ప్రభుత్వం సైతం గ్రామ పంచాయతీలను తీవ్ర కష్టాల్లోకి నెట్టేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక తమ కష్టాలు తీరతాయని ఆశించిన పంచాయతీ పాలకులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుంచి వచ్చినప్పటికీ పంచాయతీలకు జమ చేయకుండా కూటమి ప్రభుత్వం కోలుకోలేని దెబ్బకొట్టింది. అంతటితో ఆగకుండా పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే ఆదాయాన్ని సైతం నిలుపుదల చేయించి కోలుకోలేని స్థితికి నెట్టేసింది. ఏలూరు జిల్లాలో 27 మండలాల పరిధిలో 547 గ్రామ పంచాయతీలు, పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 409 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు సరిగ్గా ఇవ్వకుండా గ్రామాల్లోని అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం కలిగించింది. తాము అధికారంలోకి వస్తే పంచాయతీలను ఆదుకుంటామని కూటమి నేతలు గత ఎన్నికల్లో ఉపన్యాసాలు దంచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక గత వైసిపి ప్రభుత్వం కంటే దారుణంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలో స్థలాలు, ఆస్తులకు సంబంధించి జరిగే రిజిస్ట్రేషన్ల నుంచి వచ్చే ఆదాయంలో రెండు శాతం నిధులు సదరు పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ ఇవ్వాల్సి ఉంది. 2024 మే నుంచి ఈ నిధులు నిలిచిపోయాయి. ప్రభుత్వమే పంచాయతీలకు నిధులు జమ చేయొద్దని చెప్పిందని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు చెబుతున్నారు. పంచాయతీల పరిధిలో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే సొమ్మును ఏడాదికి నాలుగు దఫాలుగా పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ జమ చేసేది. తక్కువగా లెక్కించినా మైనర్ పంచాయతీలకు సైతం రూ.రెండు లక్షలకు పైగా ఆదాయం వచ్చేది. మేజర్ పంచాయతీలకు రూ.పది లక్షలు వరకూ ఆదాయం వచ్చేదని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం నిలుపుదల చేయడంతో పంచాయతీల్లో నిధులు లేకుండాపోయాయి. ఇంటి, కుళాయి పన్నుల వసూలు డిసెంబర్ నుంచి మార్చి మధ్యలోనే సాగుతాయి. మిగిలిన కాలంలో పంచాయతీల్లో పని చేసే ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు, ఇతర పనులకు రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వచ్చే ఆదాయాన్ని ఉపయోగించుకునేవారు. ఇప్పుడు ఆ ఆదాయం సైతం నిలిచిపోవడంతో పంచాయతీల్లో పనులు చేయడానికి నిధులు లేకుండాపోయాయి. దీంతో పంచాయతీ పాలకులు, అధికారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందినట్లని ఉపన్యాసాలు దంచే పాలకులు నిధులు ఇవ్వకుండా గ్రామాలను నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు తాను గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చెబుతున్నారు. మరి పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని అన్ని రకాలుగా నిలుపుదల చేస్తే గ్రామాలు ఏవిధంగా అభివృద్ధి చెందుతాయో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి.

ఆర్థిక సంఘం నిధులివ్వని దుస్థితి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం పంచాయతీల విషయంలో తీరు ఏమాత్రం మారలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేసి నెలలు గడిచిపోతుంది. ఇప్పటి వరకూ ఆ సొమ్మును పంచాయతీల ఖాతాల్లో జమ చేయలేదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఆర్థిక సంఘం నిధులు రూ.140 కోట్లు వరకూ రావాల్సి ఉన్నట్లు అంచనా. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో పంచాయతీల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోంది. వీధిలైట్లు, తాగునీరు, డ్రెయినేజీ వంటి సమస్యలు సైతం పరిష్కరించలేని పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తుందని కూటమి నేతలే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వచ్చే ఆదాయం, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని అంతా కోరుతున్నారు.

రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో..

బాల కార్మికులు లేకుండా చూడాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లలో ఎటువంటి బాల, కౌమార కార్మికులు పని చేయకుండా చూడాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాలోని ఆక్వాకల్చర్ యూనిట్స్‌కు సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రీ ప్రాసెసింగ్, ప్రాసెసింగ్ యూనిట్‌లో కార్మిక శాఖ సంక్షేమానికి సంబంధించి, మత్స్యకార సంక్షేమ శాఖ, కాలుష్య నియంత్రణ శాఖ, పరిశ్రమ శాఖ, ఎంపెడ్ శాఖలకు సంబంధించిన చట్టాల అమలు ఏ విధంగా జరుగుతోందో పరిశీలించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో బాల కార్మికులు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా మహిళా కార్మికుల పనికి సంబంధించి సంక్షేమ నిబంధనల అమలు చట్ట ప్రకారం జరగాలని ఆదేశించారు. అంతర్ రాష్ట్ర వలస కార్మికుల పిల్లలు బడి బయట ఉన్నట్లు గుర్తించినట్లయితే వారిని పాఠశాలలో నమోదు చేయించి తగు విద్యా వసతులు కల్పించాలని డిఇఒను కలెక్టర్ ఆదేశించారు. ఆక్వా రైతులకు చేపలు, రొయ్యల సాగులో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఉప కార్మిక కమిషనర్, కమిటీ నోడల్ అధికారి పి.శ్రీనివాస్, సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.రాణి జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నరసయ్య, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కాలుష్య నియంత్రణ అధికారి వెంకటేశ్వరరావు, కర్మాగారాలు, ఎంపెడా శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు హాజరయ్యారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగించాలి

తల్లిపాల ప్రాముఖ్యతపై జిల్లాలోని గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్లోని గౌతమీ సమావేశం హాల్లో గురువారం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు తాగే పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలు అందించడం వల్ల బిడ్డతో పాటు తల్లికి కూడా ఉపయోగాలున్నాయన్నారు. తల్లిపాలు ఎక్కువ నెలలు అందించిన తల్లులకు బ్రెస్ట్ కేన్సర్ ప్రమాదం తక్కువగా ఉంటుందన్నారు. ప్రసవం అయిన 6 నెలల వరకూ ఇంట్లో భర్త, అత్తమామలు బిడ్డ తల్లికి ఇంటి పనుల్లో ఆసరాగా ఉండేలా అంగన్వాడీ సిబ్బంది అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలోని బస్టాండ్లు, సినిమా హాళ్లు, మాల్స్, తదితర పబ్లిక్ ప్రదేశాలలో బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఐసిడిఎస్ పీడీ పి.శారద మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై జిల్లాలోని గర్భిణులకు, బాలింతలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. జిల్లాలో 4 బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్‌లు ఉన్నాయని, మరికొన్ని ఏర్పాటుకు ఆలోచిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒలు పద్మావతి, తులసి, లీగల్ అడ్వయిజర్ రాఘవమ్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గురువుల గోడు..!

రెండు నెలల నుంచి ఉపాధ్యాయులకు అందని జీత భత్యాలు

ఉద్యోగోన్నతులు, బదిలీ అయిన ఉపాధ్యాయులకు తిప్పలు

పొజిషన్ ఐడిలు ఇవ్వకపోవడమే ప్రధాన కారణం

జీతాల కోసం 4 వేల మంది ఉపాధ్యాయుల ఎదురుచూపు

ఆందోళన బాటలో ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి - భీమవరం

రెండు నెలల నుంచి గురువులు వేతనాల కోసం గగ్గోలు పెడుతున్నా సర్కారు వినిపించుకోవడం లేదు. జీత భత్యాలు లేక గురువులు పడుతున్న ఇబ్బందులు పట్టడం లేదు. ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ ముగిసి రెండు నెలలు గడుస్తున్నా పొజిషన్ ఐడిలు రాకపోవడంతో జీతాల కోసం నిరీక్షిస్తున్నారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం, విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 14 వేల మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది వివిధ కేడర్లలో పని చేస్తున్నారు. వారిలో సుమారు 3,500 నుంచి 4 వేల మందికిపైగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. అందులో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, మోడల్ ప్రయిమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సమానస్థాయి కేడర్ ఉపాధ్యాయుల, సెకండరీ గ్రేడ్, సమానస్థాయి కేడర్ ఉపాధ్యాయులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు తదితర కేడర్లలో ఉన్నవారు బదిలీ అయినట్లు నివేదికలు చెబుతున్నాయి. కొత్తగా ఏర్పడిన మోడల్ ప్రయిమరీ స్కూల్‌కు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిలు బదిలీ అయ్యారు. మోడల్ ప్రయిమరీ పాఠశాలలు కొత్తగా ఏర్పడడంతో ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం పొజిషన్ ఐడిలు కేటాయించాల్సి ఉంది. అయితే బదిలీలు జరిగి రెండు నెలలవుతున్నా పొజిషన్ ఐడిలు కేటాయించ లేదు. దీంతో సుమారు 4 వేల మందికి పైగా రెండు నెలలు జీతాలు అందలేదు. ఇప్పటికే యుటిఎఫ్, ఎస్‌టియు సంఘాలు ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని పలుమార్లు ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో జిల్లా కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునివ్వడంతో వేలమంది ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. పొజిషన్ ఐడిలిచ్చి జీతాలు చెల్లించలేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఫ్యాప్టో నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సిఎఫ్‌ఎంఎస్‌లో వివరాలున్నా పొజిషన్ ఐడి సాకు

పాఠశాల మారిన గురువులకు, స్థాయి మారిన ఉపాధ్యాయులకు రెండు మాసాల నుంచి జీతాలు వేయకపోవడానికి సాంకేతిక సమస్యలను విద్యాశాఖ అధికారులు ఎత్తి చూపుతున్నారు. గతంలో రెగ్యులర్ జీతాలు తీసుకుంటున్నా వీరి స్థానం మారడంతో ఏ పాఠశాలకూ, ఏ స్థానానికి బదిలీ అయ్యారో దానికి సంబంధిత ఉద్యోగికి పొజిషన్ ఐడిని ప్రభుత్వం కేటాయిస్తుంది. సిఎఫ్‌ఎంఎస్‌లో వారి వివరాలను ప్రభుత్వం పొందుపరుస్తోంది. అప్పుడే వేతనాలు ఇవ్వడానికి అవకాశముంటుంది. పొజిషన్ ఐడి ఇవ్వడంలో ఆలస్యం కారణంగా రెండు నెలల జీతం బదిలీ అయిన ఉపాధ్యాయుల ఖాతాలకు ఇప్పటివరకూ జమ కాలేదు.

ప్రభుత్వం తీరుపై సార్వత్రా విమర్శలు

ఉపాధ్యాయులపై ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయా ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. యోగాంధ్ర, మెగా పేరెంట్స్ మీట్ వంటి కార్యక్రమాలకు ఎంతమంది హాజరయ్యారు. ఎన్ని ప్రాంతాల్లో సమావేశాలు జరిగాయి తదితర అంశాలను క్షణంలో ప్రభుత్వ పెద్దలు తెలుసుకున్నారు. మరి ఉపాధ్యాయుల సమాచారం తెలుసుకోవడానికి, వారికి ఐడిలు కేటాయించడానికి ఎంత సమయం పడుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో రెండు నెలలుగా ఐడిలు కేటాయించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులపాలవుతున్నామంటూ ఉపా ధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో చెక్కులు బౌన్స్ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ఖర్చులకు, పిల్లల ఫీజులు ఇతర చెల్లింపులకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం కావాలనే ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పి-4 పేరిట ఉద్యోగులపై వేధింపులు తగవు

ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

పి-4 పేరిట ఉద్యోగులపై వేధింపులు తగవని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ భవనంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లాలో పి-4పై కొంతమంది అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారని, మార్గదర్శకులుగా ఉండాలని ఉద్యోగులను వేధిస్తున్నారని తమ దృష్టికొచ్చిందని చెప్పారు. భీమవరం మున్సిపల్ కమిషనర్ 26 మందికి షోకాజ్ నోటీసులు ఇస్తే తమ సంఘం తరపున ముఖ్యమంత్రితో మాట్లాడి 24 గంటల్లో నోటీసులు ఉపసంహరించుకునేలా చేశామన్నారు. తాము పి-4 కార్యక్రమాన్ని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అయితే ఉద్యోగులు స్వచ్ఛందంగా వచ్చి చేయాలి తప్ప, బలవంతంగా ఒత్తిడి చేస్తే సహించేది లేదని తెలిపారు. సంఘం సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలవుతున్నా ఉద్యోగులపై దృష్టి పెట్టలేదన్నారు. ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిలు మాత్రమే అడుగుతున్నారు తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని తెలిపారు. రానున్న రోజుల్లో జరిగే పోరాటాలు, ఉద్యమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. సంఘం రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ జనరల్ పి.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, వారికి రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ సెలవులు ఇవ్వాలని కోరారు. సంఘం అసోసియేట్ ఛైర్మన్ ఫణి పేర్రాజు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.రాజేష్, ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ పాల్గొన్నారు

ఆదివాసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నా

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాల నిర్వహణకు రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ఆదివాసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నానని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమాల నిర్వహణకు ఆయన సిబిఆర్ ట్రస్టు నుంచి రూ.రెండు లక్షలు ప్రకటించి ఐటిడిఎ పిఒ రాములునాయక్‌కు అందించారు. ఈ సందర్భంగా కెఆర్.పురం ఐటిడిఎ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులతో పాటు ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీలకు విద్య, వైద్యం, జీవనోపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి అన్నారు. ఈ దినోత్సవం వారి గౌరవానికి గుర్తుగా జరగాలని, ఆదివాసీల సాంస్కృతిక విలువలను నిలబెట్టాలంటే సామూహికంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో అట్టహాసంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను శీఘ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పోలవరం నియోజకవర్గంలో ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం సమర్థవంతంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆదివాసీ దినోత్సవం నిర్వహించే ప్రాంగణాన్ని ఆంధ్రప్రదేశ్ ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులుతో పరిశీలించారు. అధికారులు, సంఘాల నాయకులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎఐతో నేరాల దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నేరాల నమోదు ప్రక్రియ, దర్యాప్తు వంటి అంశాలపై జిల్లా పోలీసులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించి నేరాల దర్యాప్తు అంశంపై జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులకు గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రజల ఫిర్యాదులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోర్డ్ టెక్నాలజీ ద్వారా రికార్డు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ టెక్నాలజీ వేగవంతమైన దర్యాప్తునకు, ఫిర్యాదుదారులకు న్యాయాన్ని అందించడానికి దోహదపడుతుందని ఎస్‌పి చెప్పారు. ఆధునిక పరిజ్ఞానాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఒక్కరోజు అవగాహన కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర, పోలవరం డిఎస్‌పి వెంకటేశ్వరరావు, నూజివీడు డిఎస్‌పి ప్రసాదరావు, ఎస్‌బి సిఐ మల్లేశ్వరరావు, డిసిఆర్‌బి సిఐ హబీబ్‌భాషా, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి కల్పనే లక్ష్యం

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలను ఆహ్వానించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానమే ఆంధ్రప్రదేశ్‌లోనూ కొనసాగుతోందన్నారు. రూపాయి, లక్ష, కోటి అనే అంకెలు కాదని, పరిశ్రమలను ఆహ్వానించేందుకు అందించే రాయితీలను చూడాలని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ప్రతి అంశం అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇటీవల తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన బిసి కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే వెనకబడిన తరగతులకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. నూజివీడు పట్టణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సకల సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. నూజివీడు పట్టణ అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక రచించినట్లు తెలిపారు. గృహ నిర్మాణానికి సంబంధించి క్యాబినెట్ నిర్ణయం మేరకు త్వరలో అన్ని వసతులను పేదలకు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు ఉపాధి హామీలో పెండింగ్ బిల్స్ సెటిల్ చేయనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సేవల్లో అలసత్వం వహిస్తే సహించం

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేయాలి

ఎపి సిపిడిసిఎల్ ఛైర్మన్ పొగాకు పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాట్లాడుతున్న పుల్లారెడ్డి, మురళీకృష్ణయాదవ్

విద్యుత్ సేవల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎపి సిపిడిసిఎల్ ఛైర్మన్ పొగాకు పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్ విద్యుత్ శాఖ అధికారులను హెచ్చరించారు. పట్టణంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో గురువారం నూజివీడు డివిజన్ విద్యుత్ శాఖాధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి, మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్ త్వరితగతిన మంజూరు చేయాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండల స్థాయిలోనూ విద్యుత్ సరఫరా ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఆయా అధికారి రేటింగ్ అనుసరించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా 132 కెవి 33 కెవి ఉప కేంద్రాల ఏర్పాటు గురించి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణతో చర్చించారు. ఈ సమావేశంలో టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.హనుమయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.కొండల్‌రావు, ఆర్.రవికిషోర్, ఆయా ప్రాంతాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఆర్‌ఒబిలను వేగంగా నిర్మించాలి

కేంద్ర రైల్వే శాఖ మంత్రికి ఏలూరు ఎంపీ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కేంద్ర మంత్రికి వినతి అందిస్తున్న ఎంపీ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను గురువారం వారి కార్యాలయంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కలిసి పలు పెండింగ్ ప్రాజెక్టులు, సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో 12 ముఖ్యమైన ప్రధానమైన రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు ఉన్నాయని, ఇవి అప్‌ల్యాండ్, డెల్టాను కలుపుతూ భారీ ట్రాఫిక్ ఉండే ప్రాంతాలు కావడం, జాతీయ రహదారి సమీపంలో ఉండడంతో భారీగా ట్రాఫిక్ జామ్‌లకు కారణమవుతున్నాయని, ఈ ప్రదేశాల్లో ఆర్‌ఒబి లేదా ఆర్‌యుబిలు నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పలు ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్న ఈ ప్రాంతంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆర్‌ఒబిల పనులు వేగవంతంగా నడిచే విధంగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలోని సంబంధిత రైల్వే అధికారులకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీ కేంద్రమంత్రిని కోరారు. ఎంపీ ఇచ్చిన వినతి పత్రంపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రాధాన్యతా క్రమంలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వేగంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

నిరుపేదలకు అండగా సిఎం సహాయ నిధి

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేదల మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం వేల కోట్లు కేటాయించిందని, ఆపత్కాలంలో ఉన్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఇటీవల వైద్యం చేయించుకుని సిఎం సహాయ నిధికి అర్జీ పెట్టుకున్న 49 మంది కుటుంబాలకు సుమారు రూ.31 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో వైద్యం చేయించుకున్న వారు కూడా వైద్యం చేయించుకున్న బిల్లులను తమ కార్యాలయంలో అందిస్తే సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం వెంటనే అందిస్తామన్నారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మంత్రి పార్థసారధిని బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి జన సురక్షపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో కెనరా బ్యాంక్ వద్ద బ్యాంక్ మేనేజర్ కె.శ్రీకాంత్, డివిజనల్ మేనేజర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు, గ్రామ ప్రజలకు గ్రామ స్థాయి జన సురక్ష అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా (పిఎంజెజెబివై) పథకానికి 18 నుంచి 50 ఏళ్ల నిండినవారు అర్హులని తెలిపారు. సహజంగా మరణిస్తే రూ.రెండు లక్షలు అందిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పిఎంఎస్‌బివై) పథకానికి 18 నుంచి 70 ఏళ్ల నిండినవారు అర్హులని, ఈ ప్రమాద బీమా కింద రూ.రెండు లక్షలు అందిస్తుందని తెలిపారు. ఈ ప్రీమియం కోసం పిఎంజెజెబివై పథకానికి ప్రతి సభ్యుడు, సభ్యురాలు బ్యాంకు ఖాతాలో సంవత్సరానికి రూ.436, పిఎంఎస్‌బివై పథకానికి రూ.20 తప్పకుండా ఉండాలని తెలిపారు.

కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలి

మంత్రి నారాయణకు అంబుల వైష్ణవి వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాల పునర్విభజనలో కైకలూరు నియోజకవర్గాన్ని ఏలూరులో కలపడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పునఃసమీక్షించి కైకలూరు నియోజకవర్గం కృష్ణా జిల్లాలో కలపాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కోరారు. మంత్రి నారాయణను అమరావతిలో బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ కృష్ణా జిల్లా నుంచి రావాల్సిన సాగు, తాగునీరు పుష్కలంగా పూర్తిస్థాయిలో అందక ప్రతి ఏటా పంటలు ఎండుతున్నాయన్నారు. ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి నుంచి నేరుగా బస్సు సౌకర్యం ఏలూరుకు లేకపోవడం, అసలు రైలు సౌకర్యం లేకపోవడంతో ప్రయివేట్ వాహనాలు ఎక్కి గుడివాడ మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుందని, పంటల సాగునీరుకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అన్నిరకాలుగా గత నాలుగేళ్లుగా ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని కోరారు.

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - మండవల్లి

దోచుకోలేనిది ఏదైనా ఉందంటే అది కేవలం విద్య ఒక్కటేనని ఎంఇఒ డి.రామారావు అన్నారు. మండలంలోని పెరికెగూడెం హైస్కూలులోని విద్యార్థులకు విన్నర్ సెరామిక్స్ కంపెనీ లిమిటెడ్ వారి ఆర్థిక సహాయంతో అందించిన 1500 పుస్తకాలను ఆయన ఎంఇఒ-2 రత్నసునందంతో కలిసి విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ దాతలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న విన్నర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విన్నర్ సెరామిక్స్ జనరల్ మేనేజర్ ఎస్.అమరనాథ్, హెచ్‌ఆర్ ఎజిఎం వి.శ్రీనివాస్, హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పాఠశాలకు గోల్డెన్ స్కూల్ అవార్డు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ 2045-2025లో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూలకు చెందిన విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచి స్టేట్ టాపర్స్‌గా నిలిచారని ప్రిన్సిపల్ సరోజినీ తెలిపారు. ఎస్.హేమంత్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో స్టేట్ మూడో టాపర్ అవార్డు సాధించి గోల్డ్ మెడల్, రూ.1200 నగదు బహుమతి దక్కించుకున్నాడు. కె.ఫణీష్ సోమి రెడ్డి సైన్స్ ఒలంపియాడ్‌లో స్టేట్ ఐదో స్థానంలో మెడల్, రూ.వెయ్యి నగదు బహుమతి దక్కించుకున్నాడు. మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ఎక్సలెన్స్ అవార్డులను శివనాగ్, డింపుల్, వర్షిత్ రాజ్, ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో ఎక్సలెన్స్ మెడల్‌ను ప్రజ్ఞత సరోజ్ గెలుచుకున్నారు. ప్రతిభా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు నేషనల్ లెవెల్‌లో గోల్డెన్ స్కూల్ అవార్డును ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ వారు బహూకరించారు. బెస్ట్ కోఆర్డినేటర్ అవార్డు, సైన్స్ టీచర్ చిరంజీవి, మ్యాథ్స్ టీచర్ చినబాబుకు ఇన్స్పైరింగ్ టీచర్స్ అవార్డ్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో విద్యార్థులను, ఉపాధ్యాయులను యాజమాన్యం వారు అభినందించారు.

నేరాలు - ఘోరాలు

లారీ, బస్సు ఢీకొని కూలీ మృతి

బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను - రాజమండ్రి జాతీయ రహదారిపై పొలసానిపల్లి గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లికి చెందిన కె.గణేష్ నెల్లూరులోని ఒక రైస్‌మిల్లులో కూలీగా పని చేస్తున్నారు. ఆయన అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు తులసి ట్రావెల్స్ బస్సులో బుధవారం రాత్రి బయలుదేరారు. బస్సు గురువారం తెల్లవారుజామున పొలసానిపల్లి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు, అందులో ప్రయాణిస్తున్న కె.గణేష్ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో గణేష్ మృతి చెందారు. డ్రైవర్‌ను ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువతి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు పట్టాలు దాటుతున్న యువతిని రైలు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన బాపులపాడు మండలం ఏపూరు గ్రామంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఏపూరు గ్రామానికి చెందిన దేవరపు శివమ్మ (18) తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఏపూరు గ్రామ శివారులో టైలరింగ్ నేర్చుకుంటుంది. ఆమె టైలరింగ్ నేర్చుకునేందుకు రైలు పట్టాలను దాటి వెళ్లాలి. ఈ క్రమంలో గురువారం కూడా రైలు పట్టాలను దాటుతుండగా ఆమెను వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని గుళ్లపూడి గ్రామంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిఎస్ డిటి వెంకటేశ్వరరావు కలిసి బడా దోస్త్ వాహనంలో తరలిస్తున్న 41 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టుకున్నారు. అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి ఆ బియ్యాన్ని సీజ్ చేసి సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన కుప్పాల పిచ్చమ్మ భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. ఈ నెల ఆరో తేదీన బొర్రంపాలెం గ్రామ శివారు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో పిచ్చమ్మ తనకున్న మేకలను మేపుతుండగా అదే గ్రామానికి చెందిన గొడుగు జయ హనుమాన్ మద్యం తాగి బైక్‌పై వచ్చి ఆమెతో గొడవ పడి బూతులు తిడుతూ పీక నొక్కి చంపుతానని బెదిరించగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు రావడంతో పారిపోయాడు. పిచ్చమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రేపు ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల తొమ్మిదో తేదీ శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కోటరామచంద్రపురం ఐటిడిఎ పెరేడ్స్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ రాములునాయక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన ప్రజా ప్రతినిధులు, వివిధ గిరిజన సంఘనాయకులు, ప్రజా సంఘాల సభ్యులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఇంటింటా త్రివర్ణ పతాకం.. దేశభక్తి పాటలు విద్యార్థులతో నిర్వహించినట్లు హెచ్ఎం విజయకుమారి తెలిపారు. స్కూల్ గోడలు శుభ్రపరిచి త్రివర్ణ కళా చిత్రాలు వేసినట్లు తెలిపారు. ప్రదర్శనగా పురవీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ముగ్గుల పోటీలు, స్వచ్ఛత కార్యక్రమం, ఫ్లాగ్ సెల్ఫీ తీయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, ఫిలోమిన, దుర్గ మల్లేశ్వరరావు, జయకుమారి, రాజేంద్రప్రసాద్, బివిడిఎస్.ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బండివారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన పెద్దలు ఝూపల్లి శేషగిరిరావు, దాసరి రాంబాబు రూ.20 వేల విలువైన సౌండ్ సిస్టం బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం డి.బాజా తెలిపారు. దాతలను పాఠశాల ఆవరణలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

అంకితభావంతో పనిచేసే వైద్యులకు ఎల్లవేళలా అండగా ఉంటానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ హామీ ఇచ్చారు. చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా నియామకమైన గైనకాలజిస్ట్ వల్లూరి హర్షిత బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - చింతలపూడి

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టిందని, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. మండలంలోని సమ్మెటవారిగూడెంలో చింతలపూడి నుంచి రాఘవాపురం మెయిన్ రోడ్డు పనులను ఆయన గురువారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గావరపు ముత్తారెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ తాటి అప్పారావు, ఎంపిటిసి మాజీ సభ్యులు కనమతరెడ్డి రాజారెడ్డి, సీనియర్ నాయకులు చిట్లూరి ధర్మరాజు, రావెళ్ల హనుమంతరావు, ఎంపిటిసి సభ్యులు రాజేంద్ర కపూర్ పాల్గొన్నారు.

'బిసిలకిచ్చిన హామీలు అమలు చేయాలి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్మన్ బత్తిన నాగలక్ష్మి విమర్శించారు. జంగారెడ్డిగూడెంలో వైసిపి, బిసి నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసిలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా తుంగలోకి తొక్కిందన్నారు. వైసిపి హయాంలో బిసిలకు పెద్దపీట వేసి అనేక పదవులు, ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ పిపిఎన్.చంద్రరావు, ఎల్‌విఆర్, చిటికిన అచ్యుత రామయ్య, మల్లి బాబు, బత్తిన చిన్న, శ్రీధర్, చిప్పాడ వెంకన్న, నెట్రూ గణేష్, పెసరగంటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మణస్వామివర్మ జయంతి

ప్రజాశక్తి - కలిదిండి

అగ్నికుల క్షత్రియుల చరిత్రను వెలికి తీసిన మహోన్నత వ్యక్తి పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ అని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తాడినాడ పంచాయితీ పరిధి సున్నంపూడిలో లక్ష్మణస్వామివర్మ 156వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దక్షిణ భారతదేశాన్ని పాలించిన అగ్నికుల క్షత్రియులని కొనియాడారు. కొల్లాటి మాగ్రాజు, చిప్పల నరసింహ స్వామి, వాటాల దశరథిరామ్, పొన్నమండ వెంకట చలపతిరావు, బుల్లియ్య, పొన్నాల లక్ష్మణరావు, వాతాడి రాంబాబు, దుర్గారావు పాల్గొన్నారు.

నేడు కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల ఎనిమిదో తేదీన పవర్‌పేటలోని అన్నే భవనంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎబి.వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి కోకో రైతు ప్రతినిధులు విచ్చేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పెండింగ్ బిల్లుల విడుదల హర్షణీయం

ప్రజాశక్తి - ముసునూరు

పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ రుణాలు విడుదల చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధికి టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 2014-2019 ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీమ్‌లో మండలంలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.2.27 కోట్లు రిలీజ్ చేసినట్లు తెలిపారు.

వైద్య సేవల్లో జవాబుదారీతనం పెంచాలి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవల్లో జవాబుదారీతనం పెంచి, ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. ప్రభుత్వ సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయి అంశంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి స్థాయి, అవినీతి, నిర్లక్ష్యం, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్‌ఎస్ విధానం ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడడంతో పాటు, వారికి మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతోపాటు, ప్రజలకు మంచి సేవలందిస్తూ, ప్రజల మన్ననలు పొందిన వారిని అభినందిస్తామన్నారు. బొర్రంపాలెం, కొల్లేటికోట, జీలుగుమిల్లి పిహెచ్‌సిల్లో వైద్య సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఐవిఆర్‌ఎస్ సర్వేలో వచ్చిందన్నారు. ఐవిఆర్‌ఎస్ సర్వేలో వెనుకబడిన అధికారులు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. మండవల్లి, పట్టిసీమ, తాడువాయి, ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో సిబ్బంది మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని ఐవిఆర్‌ఎస్ సర్వే వచ్చిందని వారిని కలెక్టర్ అభినందించారు. జిల్లాలో పెన్షన్ పంపిణీలో ప్రజల సంతృప్తి స్థాయిపై డిఆర్‌డిఎ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించి, సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసరాలు, క్యూ లైన్లలో పారిశుధ్యం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సొసైటీ అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నాగేశ్వరరావును అభినందిస్తున్న ప్రముఖులు

పట్టణ, మండలంలోని వేగవరం, తాడువాయి గ్రామాల సొసైటీలకు అధ్యక్షులను నియమించారు. జంగారెడ్డిగూడెం పట్టణ సొసైటీకి మానికల నాగేశ్వరరావు, వేగవరం సొసైటీకి ఆలపాటి దుర్గారాం ప్రసాద్, తాడువాయి సొసైటీకి కొడవటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. పట్టణంలో నాగేశ్వరరావుకు కొండ్రెడ్డి కిషోర్ శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీకి, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్ర శేషు, బొబ్బర రాజ్‌పాల్, అల్లూరి రామకృష్ణ, సాయిల సత్యనారాయణ, రాజాన సత్యనారాయణ, మహంకాళి రాంబాబు, బూరుగుపల్లి సూరిబాబు, కరణం రాంబాబు, మానికల సూరిబాబు, గెడా సుబ్రహ్మణ్యం, తాళ్లూరి వెంకటేష్, నాయుడు శ్రీను, రాంబాబు, తోట సతీష్, మహేష్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమగ్రాభివృద్ధికి చట్టం చేయాలి

ఏలూరు అర్బన్ :చేనేత కార్మికుల సమగ్రాభివృద్ధికి చట్టం చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని, చేనేతకు మరణశాసనమైన జిఎస్‌టి నుంచి చేనేతను మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు కోరారు. ప్రపంచ చేనేత దినోత్సవాన్ని గురువారం స్థానిక పత్తేబాద మరకవారి వీధి సెంటర్ వద్ద చేనేత కార్మికులు ఘనంగా నిర్వహించారు. ముందుగా చేనేత మగ్గం పతాకాన్ని పిచ్చుక ఆదిశేషు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మగ్గం నేస్తున్న చేనేత కార్మికులకు 200 యూనిట్లకు, పవర్లూమ్ కార్మికులకు 500 యూనిట్లకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించడాన్ని సంఘం స్వాగతించిందని, రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని, నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించి చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరక శివయ్య, డివైఎఫ్ఐ నాయకులు కొల్లి ఈశ్వర్, మరక జగన్నాధరావు, మహిళా చేనేత కార్మికులు, ఇతర వృత్తిదారులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో...

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకూ పోరాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. సిఐటియు మండల ఆరో మహాసభ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నత్తా వెంకటేశ్వరరావు, టి.మాణిక్యం అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. అనంతరం మండల కార్యదర్శి బాలరాజు ప్రవేశపెట్టిన మూడేళ్ల నివేదికపై ప్రతినిధులు చర్చించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నత్త వెంకటేశ్వరరావు, కో-కన్వీనర్లుగా సువర్ణరాజు, ఆమని, టి.విజయరాజు, కమిటీ సభ్యులుగా భూక్య నాగరాజు, లావేటి వంశీ, ఎం.బాలరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, అనుబంధ ప్రతి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్నికయ్యారు.

కార్మికులకు కనీస వేతనాలు అందించాలి

ఆగిరిపల్లి :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే వీడనాడాలని, లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆగిరిపల్లి మండల ఐదో మహాసభ గురువారం సాయంత్రం ఆగిరిపల్లిలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రాజులపాటి చంటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, జిల్లా నాయకులు ఆర్. హనుమాన్లు, సిహెచ్.శివనాగరాజు, కెవికె.ప్రసాద్, ఎం.నరేష్, అమృత, పుల్లమ్మ, అన్నమ్మ, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, కుశలవ వర్కర్స్, ముఠా కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో...

రాష్ట్రాభివృద్ధిలో కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ ఎంపీ చింతా మోహన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలో ఉన్న గ్రామపంచాయతీల్లో, నగరపాలక సంస్థల్లో సరైన మౌలిక సదుపాయాలు లేక పరిస్థితి అధ్వానంగా తయారైందని మాజీ ఎంపీ చింతా మోహన్ విమర్శించారు. ఏలూరులోని ఒక ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సర్పంచుల వద్ద కనీసం వీధిలైట్లు మార్చడానికి కూడా నిధులు లేవని, పంచాయతీలు మరీ అధ్వానంగా తయారయ్యాయని విమర్శించారు. నగరంలో అభివృద్ధి శూన్యమన్నారు. దేశంలో ఎస్‌సిల పరిస్థితి మరి అధ్వానంగా తయారైందన్నారు. చేనేత వర్గాలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలని కోరారు. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి చంద్రబాబు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని, ఒబిసిలకు ఎటువంటి న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. బైబిల్ చదువుతుందని నెపంతో 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఒక టిటిడి ఉద్యోగిని ఉద్యోగం నుంచి తీసివేయడం సిగ్గుచేటన్నారు. రాజధాని నిర్మాణం కోసం రూ.75 వేలు సేకరించి, మూడు పంటలు పండే భూమిని సంపన్నులకు, వ్యాపారులకు కట్టబెట్టి రైతుల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. మోడీ వచ్చి 11 ఏళ్లు గడిచినా దేశంలో అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. దేశంలో ఎక్కడా పత్రిక స్వేచ్ఛ లేదన్నారు.

ప్రభుత్వ కాలనీ రోడ్డు అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో కొత్తపేట నుంచి ప్రభుత్వ కాలనీకి (మత్స్యకారుల ఇళ్లకు) వెళ్లే మట్టి రోడ్డును అభివృద్ధి చేయాలని గ్రామానికి చెందిన సామాజిక వేత్త జి.పాండురంగ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చినుకు పడితే రోడ్డంతా ఛిద్రంగా మారడమే కాకుండా చిన్నపాటి చెరువును తలపిస్తుందన్నారు. రోడ్డు దుస్థితిపై ఎంపిడిఒ, డిపిఒ, ఇతర అధికారులకు వినతిపత్రాలు అందించగా కంకరు మట్టిని పోస్తామని చెప్పారని, నెలలు గడుస్తున్నా నేటికీ అభివృద్ధి చేయలేదన్నారు. స్థానిక మత్స్యకారులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు.

మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - కుక్కునూరు

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా కుక్కునూరు మండలంలో 23 గ్రామాలను మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ గ్రామాల్లో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌ల నిర్వహణతో గ్రామాలు శుభ్రంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో వేలేరుపాడు ఎంపిడిఒ శ్రీహరి, ఎఇ జగదీష్, డిప్యూటీ ఎంపిడిఒ, ఐసిడిఎస్‌తో కూడిన నాలుగు బృందాలు గురువారం దాచారం, కివ్వాక, కుక్కునూరు గ్రామాలను పరిశీలించాయి. ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ధర్మ, గోవింద్, గణేష్, శ్రీరామచంద్రమూర్తి, ఎంఆర్‌సి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

12న నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

జాతీయ నులి పురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పూళ్ల పిహెచ్‌సి వైద్యులు పి.అరుణజ్యోతి కోరారు. 12వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో పిహెచ్‌సి వద్ద వాల్‌పోస్టర్‌ను వైద్యులు, ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు వైవి.లక్ష్మణరావు, ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్, పూళ్ల సెక్టార్ పర్యవేక్షకులు నూర్జహాన్ సంయుక్తంగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ తేదీన ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్, జూనియర్ కళాశాలల్లో నులిపురుగు నివారణ మందు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ రోజు నులిపురుగు నివారణ మందు తీసుకోనివారికి తిరిగి 20వ తేదీన మరొక మారు పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

హోంగార్డులు అన్ని విభాగాల్లో తర్ఫీదు పొందాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు శాఖతో హోమ్ గార్డ్ వ్యవస్థ సంయుక్తంగా పనిచేస్తుందని, హోంగార్డులు పోలీసులతో సమానంగా అన్ని విభాగాల్లో తర్ఫీదు పొంది ఉండాలని, అందుకు కావాల్సిన తర్ఫీదును ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అందిస్తున్నారని విశాఖపట్నం హోంగార్డ్స్ కమాండెంట్ జోషి అన్నారు. ఆయన గురువారం ఏలూరు హోంగార్డు యూనిట్‌ను సందర్శించారు. తొలుత ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం ఎస్‌పితో హోంగార్డు యూనిట్‌పై కొంతసేపు చర్చించారు. అనంతరం హోంగార్డు యూనిట్ కవాతు నిర్వహించి జోషికి వందన సమర్పణ చేశారు. అనంతరం ఆయన హోంగార్డులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి హోంగార్డ్స్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఏలూరు ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి -ముదినేపల్లి

రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఎల్‌సి నెంబర్-55 గుడివాడ- ముదినేపల్లి రోడ్డులోని మల్లాయపాలెం రైల్వే గేటును మూసి వేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు రైల్వే గేటును మూసివేస్తున్నామని, వాహనదారులు సహకరించాలని వారు కోరారు.

పేరు మార్పు

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, ఎల్.అగ్రహారం గ్రామం, L&T కాలనీకి చెందిన దేవరావ్ గైక్వాడ్ గారి కుమారుడైన గైక్వాడ్ సంజయ్ దేవరావ్ అను నేను నెం.M3758829 రు గల పాస్‌పోర్టులో GAIKAWAD SANJAY DEVARAO అని తప్పుగా పడినది. నెం.351015895269 రు గల ఆధార్ కార్డులో నా అసలు పేరు GAIKAWAD SANJAY DEVARAV అని యున్నదిని తెలియజేయడమైనది.

GAIKAWAD SANJAY DEVARAV

IN THE COURT OF THE 1st ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) : TANUKU

O.S.508/2024

Between:
Nagavarapu Ramalingeswara Rao ...Plaintiff
And
Kadali Saraswathi & Others ...Defendants

వాది తరపున వేయించిన ప్రకటన

2.Kadali Lakshmi Susmitha, D/o.Late Prabhakara Rao, Flat No.502, 5th Floor, Vasanth Vihar, Opposite to Gurajada Convent, Tanuku, TJCJC.

యిందుమూలముగా 2వ వాదికి తెలియజేయునది ఏమనగా, పైనెంబరు దావాలో కోర్టు ద్వారా మీకు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు నోటీసులు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున ఈ పేపరు ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు అయ్యి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షములో దావాను విచారించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

తణుకు — గుడిమెట్ల వీర్రెడ్డి
తేది.07.08.2025 — వాది తరపు అడ్వకేటు

నోటీసు

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.No.26/2022

Between:-
1. పడాల అమ్మాజి ...అప్పిలెంటు
మరియు
1. శ్రీమతి పడాల అనే అడబాల గీత & 7గురు ...రెస్పాండెంట్సు

టు:
రెస్పాండెంట్లు 1టు5
1. శ్రీమతి పడాల అనే అడబాల గీత, భర్త: సూర్యచంద్రరావు, డోర్ నెం. 7-1-72/2, చర్చి వీధి, రోటరీ క్లబ్ ఎదురుగా, ఆర్.డి.ఓ. ఆఫీసు వద్ద, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.
2. పడాల సత్యనారాయణ, తండ్రి: రామన్న, ప్లాట్ నెం. 42, ఫస్ట్ ఫ్లోర్, ఆర్.వి. ఉద్యాన్, ఎన్.హెచ్.ఆర్ కాలేజీ వద్ద, చందానగర్, హైదరాబాద్.
3. పడాల పాపాయమ్మ, భర్త సత్యనారాయణ, ప్లాట్ నెం. 42, ఫస్ట్ ఫ్లోర్, ఆర్.వి. ఉద్యాన్, ఎన్.హెచ్.ఆర్ కాలేజీ వద్ద, చందానగర్, హైదరాబాద్.
4. తాడి అనే పడాల అరుణకుమారి, భర్త రవికుమార్, ఫ్లాట్ నెం.505, గ్రీన్ టవర్స్, హుడా ట్రేడ్ సెంటర్, ఫ్లాట్ నెం. బి/సి, శేరిలింగంపల్లి, హైదరాబాద్.
5. సంధ్యాలాల్, భర్త : జితేంద్రలాల్, అమీన్ స్టోర్, సౌత్ అండమాన్, పోర్ట్ బ్లెయిర్.

పై నెంబరు అప్పీలులో 1టు 5 రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించుచున్నప్పటికీ వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిలువరించుచున్నారు. కావున, మీరు **ది.10-09-2025** వ తేదీ, **ఉ.10-30 ని॥లకు** పై కోర్టు వారి సమక్షమున స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గాని, హాజరు అయి, మీకు ఆక్షేపణలు ఏమైనా వున్నచో తెలియపరచుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తే॥దీ: 10-9-2025

దొండపాటి రంగారావు
స్థలం:కొవ్వూరు, — డి.డి.వి.కృష్ణారావు
తేది:06-08-2025. — అడ్వకేట్స్-కొవ్వూరు

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు

ఆర్.ఓ.సి.నెం.481/2025/ఇ1 — **ది.07-08-2025**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డులలో గ్రాంటుతో-2 పనులు మరియు పురపాలక సంఘ సాధారణ నిధులతో-2 పనులు చేపట్టుటకు గాను అంచనాలు విలువ సుమారు **రూ.36,24,000/-** లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది.11-08-2025వ తేది సాయంత్రం గం.04.00 ని॥ల నుండి లభించును.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది : 11-08-2025 సాయంత్రం గం.04.00 ని॥లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేది : 18-08-2025 సాయంత్రం గం.4.00 ని॥లకు
ప్రైస్ బిడ్ తెరుచు తేది : 18-08-2025 సాయంత్రం గం.04.30 ని॥లకు

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- కమీషనరు, పాలకొల్లు పురపాలక సంఘం.